క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారికి అన్నాభిషేకం, పూజలు చేసిన భక్తులు

భీమడోలు: గుండుగొలనులోని శ్రీభ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ పూజారులు లంకా శివశర్మ, శ్రీనివాస్ శర్మల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వార్లకు పంచామృత నవరసాల అభిషేకాలు, అన్నాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఉన్నత పాఠశాలలో కంటి పరీక్షలు



ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ దృష్టి లోప నివారణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ చక్రధర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు కె.సురేంద్రబాబు కంటి పరీక్షలు నిర్వహించి 26 మంది పిల్లలకు ఉచిత కళ్లజోళ్లకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వేంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఏ కె.శిశీల్యమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో పెదవేగి నుంచి వెళ్లే రామసింగవరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో పనులు చేపట్టనున్నారు. ఈ పనుల నిమిత్తం ఈ నెల 24వ తేదీ గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఏలూరు డివిజన్‌లోకి మార్చాలి

చింతలపూడి: చింతలపూడి, లింగపాలెం మండలాలను ఏలూరు డివిజన్‌లోకి తిరిగి మార్చాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్కే ఆజాద్ బాబు, సీపీఐ, సీపీఎం నాయకులు హోం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. చింతలపూడిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం పాల్గొన్నారు. స్థానిక ఆంధోని నగర్‌లో పర్యటించారు. అనంతరం చింతలపూడి ఆర్కే కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు తలారి ప్రకాష్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈనెల 4న కామవరపుకోట గ్రామానికి చెందిన ప్రకాష్‌పై అదే గ్రామానికి చెందిన షేక్ సైదులు, షేక్ అమ్ము, షేక్ సలీమ్ అనే వారు ఒక స్థల వివాదం గూర్చి మాట్లాడదామని పిలిచి, కులంపేరుతో దూషిస్తూ దాడి చేశారని పేర్కొన్నారు. దాడి చేసిన ముగ్గురిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సముద్రాల సుందరరావు, సాలి రాజశేఖర్, టి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు రూ.1,01,111 విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ బుధవారం తెలిపారు. పెస్టిసైడ్స్ వ్యాపారి కొల్లూరి సత్తిబాబు ఈ విరాళాన్ని అందించారన్నారు. మేకల అన్నవరం, మంతెన సోమరాజు, ఐలూరి విశ్వనాథం, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి అమలు చేయాల్సిందే..

- మహిళలను మోసగించిన కూటమి ప్రభుత్వం
- త్వరలోనే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు



దెందులూరు : కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆడ బిడ్డలు ప్రతిఘటిస్తారని దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మహిళా ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు నేనంటే ఏంటి అనుకున్నారు. అది చేస్తా, ఇది చేస్తా, దశాబ్దాల అనుభవం ఉంది. ఆంధ్రప్రదేశ్ తల రాత మారుస్తానంటూ వినలేని విధంగా హామీలు ఇచ్చి నేడు అమలు చేయలేం డబ్బులు లేవు రాష్ట్రాన్ని అమ్మాలని చెప్పటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాల అనుభవం ఉన్న చంద్రబాబు అమలు చేయలేని విషయం ముందు తెలియదా ఉచిత బస్సు మాదిరిగానే ఆడబిడ్డ నిధి కూడా షరతులతో నిలుపుదల చేయడానికి చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అయ్యింది. ఇంకెన్ని సంవత్సరాలకు ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తారు. మహిళా ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు వారి మాటల్లోనే విందాం.

పథకం అమలు చేయకపోతే ఆందోళన తప్పదు



ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు తిరగబడతారు. ఆందోళన వ్యక్తం చేయడం తథ్యం. సూపర్ సిక్స్ అమలు చేయలేరని అందరూ అనుకున్నట్టుగానే చంద్రబాబు చేస్తున్నారు. హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తారా.

– మండల సరస్వతి, జెడ్పీటీసీ, ఏలూరు

వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు



వచ్చే ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం ఖాయం. ఏదో రకంగా అధికారం చేపట్టాలని అమలు చేయలేని అమలు కానీ హామీలన్నీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయింది. పట్టుమని రెండు పథకాలు కూడా అమలు చేయలేదు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

ఆడబిడ్డలను కూడా అవమానిస్తారా



ఆడబిడ్డలు నమ్మి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. ఉచిత బస్సు అన్నారు. అమలు చేయలేదు. ఆడబిడ్డ నిధి అన్నారు. అమలు చేయలేదు. ఇంకా ఏ పథకం అమలు చేస్తారు. ఆడబిడ్డలను కూడా మోసం చేస్తారా ఇది తగదు.

– ఎం.దుర్గాకుమారి, సర్పంచ్ మేదినరావుపాలెం

ఇచ్చిన హామీని అమలు చేయాలి



ఇటువంటి మినహాయింపులు లేకుండా ఎన్నికల ముందు ఇచ్చినట్లే ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలి. ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లో ఆడబిడ్డలు అందరూ కూటమి ప్రభుత్వం అమలు చేయబోయే పథకం కోసం ఎదురుచూస్తున్నారు. సంవత్సరం అయినా ఈ పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరం. ఆడబిడ్డలు అందరూ కూటమి ప్రభుత్వ చర్యలను గమనిస్తున్నారు.

– అమల, సర్పంచ్, కొక్కిరాయిలంక

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలి



మాట్లాడుతున్న సీఐ రజనీకుమార్

గణపవరం: మహిళా పోలీసులు గ్రామాల్లో రహస్యంగా నిర్వహించే అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని గణపవరం సీఐ నక్కా రజనీకుమార్ అన్నారు. బుధవారం సర్కిల్ పరిధిలోని గణపవరం, నిడమర్రు, చేబ్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదాలు, డ్రగ్స్ వినియోగం పెరిగిపోతున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించి, వీటి నిరోధానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గణపవరం ఎస్సై ఆకుల మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో పింఛన్ ఆపారని నిరసన



ఎంపీడీఓ ఆఫీస్ ముందు నిరసన తెలుపుతున్న తాతా మాణిక్యాలరావు

పెదవేగి: రాజకీయ కక్షతో పింఛన్ నిలుపుదల చేసి తమను నానా అవస్థలకు గురిచేస్తూ నాయకులు, అధికారులు వేధిస్తున్నారంటూ పెదవేగికి చెందిన తాతా మాణిక్యాలరావు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలంటూ పెదవేగి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మాది పెదవేగి గ్రామం తనకు వినికిడి లోపం ఉందని 2022 నుంచి పింఛన్ పొందుతున్నానని, కూటమి ప్రభుత్వం వచ్చిన 2024 జులైలో రాజకీయ కారణాలతో నా పింఛన్ నిలుపుదల చేయగా 2024 జులై 8న కూటమి ప్రభుత్వంలో జిల్లా ఆసుపత్రి ఏలూరులో మరలా టెస్ట్‌కు పిలిచారన్నారు. దీంతో డాక్టర్ అర్హుడినని సర్టిఫికెట్ ఇచ్చినా ఆగస్టు పింఛన్ ఇవ్వకపోతే ఏలూరు కలెక్టరేట్‌లో స్పందనలో అర్జీ ఇచ్చినా ఫలితం లేదని తెలిపారు. అప్పుడు అదే నెలలో లోక్ అదాలత్ ఏలూరు కోర్టులో పిటిషన్ వేయగా, అప్పుడు పెదవేగి గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్, ,పంచాయతీ కార్యదర్శి వచ్చి పింఛన్ ఇచ్చేస్తామని చెప్పి 2024 సెప్టెంబర్ నుంచి 2025 జూన్ వరకు ఇచ్చారన్నారు. జూన్‌లో మళ్లీ టెస్ట్‌కు వెళ్లాలని చెప్పగా జూన్ 30న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో దరఖాస్తు చేసి, ఎంపీడీఓను కలిసి సమస్యను వివరించామని చెప్పారు. ఈ సారి వాళ్లకు వాళ్లే స్పందన ఫిర్యాదుపై నా సంతకం లేకుండా క్లోజ్ చేసి పోస్టులో ఇంటికి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి 2025 జులై 23న మళ్లీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఫోన్ చేసి మళ్లీ టెస్ట్‌కు వెళ్లమంటున్నారని బాధితుడు వాపోయాడు.

ముళ్ల చెట్లతో వాహనదారుల ఇక్కట్లు



భీమడోలు జంక్షన్‌కు వచ్చే దారి పొడవునా ఉన్న ముళ్ల చెట్లు

భీమడోలు: సూరప్పగూడెం నుంచి భీమడోలు జంక్షన్‌కు వచ్చే దారిలో రోడ్డు పక్కనే ముళ్లచెట్లు వాహనదారుల పాలిట శాపంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సూరప్పగూడెం వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా భీమడోలు జంక్షన్‌కు వచ్చే భీమడోలు, దెందూరు మండలాలకు చెందిన ద్విచక్ర వాహనదారులకు దగ్గరగా వచ్చేంత వరకు దారి పొడవునా ఉన్న ముళ్లచెట్లు రాత్రి వేళల్లో కనిపించకపోవడంతో ఒక్కసారిగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పలువురు క్షతగాత్రులవుతున్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. చాలా కాలంగా ఉన్న ఈ ముళ్లచెట్ల వల్ల వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారి వెంబడి ఉన్న ఈ చెట్లను తొలగించేందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల మీదకు మురుగు నీరు



రాచూరులో రోడ్ల మీదకు ప్రవహిస్తున్న మురుగునీరు

ఉంగుటూరు: రాచూరు గ్రామంలో మురుగు నీరు రోడ్ల మీదకు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు, పూడిపోయిన డ్రెయిన్ల వలన రోడ్ల మీదకు మురుగు నీరు చేరుతోంది. ఆర్అండ్‌బీ రహదారి మీదకు రావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ పట్టించుకొని మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆరు నెలలకే కాలం చెల్లిన రహదారి



ఆరు నెలలకు పాడైపోయిన ఆర్అండ్‌బీ రహదారి ఇదే

ఉంగుటూరు: నిర్మాణం చేసిన ఆరు నెలలకే రహదారి దెబ్బతింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉంగుటూరు నుంచి రావులపర్రు వెళ్లే రహదారి రోడ్డు నిర్మించారు. అది కూడా ఎక్కడ పోతే అక్కడ వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చింది రోడ్లు బలే బాగు చేశారనుకున్నారు. ఆరు నెలలు అయ్యిందో లేదో రోడ్డు తూట్లు పడి రహదారి రూపు రేఖలు మారిపోయాయి. దమ్ము చక్రాలు వేసుకొని ట్రాక్టర్లు తిరగడం వలన దెబ్బతిన్నాయని అంటున్నారు. రహదారి ప్రస్తుతం గాళ్లు పడిపోయి పాడైపోయింది. నాణ్యత ప్రమాణాలు కూడా అంతంత మాత్రం కావడంతో రోడ్డు పాడైపోయిందని ప్రజలు అంటున్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పోలవరం రూరల్: ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు నాయకులు ఎంపీడీఓ శ్రీనివాసబాబుకు వినతిపత్రం అందజేశారు. పది వారాలకు పైగా వేతనాల బకాయి ఉన్నాయని, వ్యవసాయ పనులు లేక, ఉపాధి కూలీ డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కూలీ పనులు 200 రోజులకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, మిడియం రవి దొర, సవల రాంబాబు, మిడియం పోశారావు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

వెంకటరెడ్డిగూడెం గ్రామానికి శ్మశాన స్థలం కేటాయించి షెడ్డు నిర్మించాలని తహసీల్దార్ ఆర్ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి శ్మశానం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఆధునిక సాంకేతికతతో భూ సర్వే



రైతుల సమస్యలను వింటున్న సీసీఎల్ఏ అదనపు ముఖ్య కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, జేసీ ధాత్రిరెడ్డి

భీమడోలు: దేశంలో మొట్ట మొదటిసారిగా ఆధునిక సాంకేతికతను వినియోగించి పారదర్శకంగా భూసర్వేను మన రాష్ట్రంలోనే సగం గ్రామాల్లో పూర్తి చేశారని రాష్ట్ర భూ పరిపాలన శాఖ అదనపు ముఖ్య కమిషనర్, సర్వే శాఖ డైరెక్టర్ ఎస్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని సూరప్పగూడెంలో బుధవారం భూసర్వే నిర్వహణా తీరుపై ఆయన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.ప్రభాకర్‌రెడ్డి రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సభలో లేవనెత్తారు. పాతూరు పరిధిలోని మూడు సర్వే నంబర్లలో తనకు ఎకరం భూమి ఉందని, అదే విధంగా సర్వే తరువాత నా భూమిలో వ్యత్యాసాలు వచ్చాయని వాటిని సరి చేయాలని రైతు కోరారు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి సరిహద్దు రాళ్ల వేయాలని రైతులు కోరారు. దీనిపై అదనపు ముఖ్య కమీషనర్, సర్వేశాఖ డైరెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలన్నింటిని పరిష్కారిస్తామన్నారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తప్పులు లేకుండా భూ సర్వే చేసేందుకు ఇక్కడ అధికారులు ఎక్కువ సార్లు గ్రామసభను నిర్వహించి, వాటిని సరి చేశారన్నారు. అనంతరం గుండుగొలను జగనన్న కాలనీలోని లేఅవుట్‌ను జేసీ, ఆర్డీవోలతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, ఆర్డీవో అచ్యుత అంబరీష్, సర్వే శాఖ ఏడీ షేక్ మహ్మద్ అన్సారీ, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉద్యోగుల శ్రేయస్సే యూటీఎఫ్ లక్ష్యం

ఉంగుటూరు: ఉద్యోగుల శ్రేయస్సు కోసం యూటీఎఫ్ పనిచేస్తుందని మండల నాయకులు అన్నారు. బుధవారం మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించారు. కైకరం హైస్కూల్‌లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మస్తాపా ఆలీ ప్రారంభించారు. ఎ.నారాయణపురం, ఉంగుటూరు, బాదంపూడి ,చిన్న వెల్లమిల్లి గొల్లగూడెం , ఎ. గోకవరం హైస్కూల్సులో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక సమస్యలపై ఏకరువు

ఏలూరు (టూటౌన్): తమ ప్రాంత సమస్యలను తక్షణం పరిష్కరించాలంటూ పోణంగి రోడ్డులోని రాజరాజేశ్వరినగర్ ప్రాంత ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు మొరపెట్టుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు డిప్యూటీ కమిషనర్ పి.శివారెడ్డి బుధవారం సాయంత్రం ఆ ప్రాంతంలో పర్యటించారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పేరుకు పోవడంతో వర్షం నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచిపోతున్నాయని స్థానికుడు, సామాజిక కర్యకర్త ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డికి వివరించారు. తమ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న కుక్కలు, పశువుల బెడద అరికట్టాలని, పశువుల దొడ్డిని ఏర్పాటు చేయాలని కోరారు. తమకు సమీపంలో ఉన్న కంపోస్టు యార్డు నుంచి వచ్చే దుర్గంధం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

హామీల అమలుపై నిలదీయండి

కామవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలు అమలుపై కూటమి నాయకుల నిలదీయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయాంకుల సత్యనారాయణ సూచించారు. తాడిచర్లలో బాబు ష్యూరిటీ – మోసం గారంటీ కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని, నిరుద్యోగ భృతి ఊసే లేదని అన్నారు. ప్రజలను మోసం చేయడానికే తప్ప, హామీలు అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడంలేదని తెలిపారు. కూటమి నాయకులు గ్రామాల్లోకొస్తే హామీలు నెరవేర్చే విధంగా నిలదీయాలని సూచించారు. జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.రామకృష్ణ, చింతలపూడి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు మెరుగు బాబురావు పాల్గొన్నారు.

వరి పంటకు బీమా తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్

గణపవరం: రైతులు వరి పంటకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. బుధవారం గణపవరం మండలం కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సార్వా సీజన్‌కు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలన్నారు. పంట రుణాలు తీసుకోని రైతులు ఆగస్టు 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలని, బ్యాంకులో రుణం తీసుకున్న వారికి మాత్రం బ్యాంకు వారే ప్రీమియం చెల్లిస్తారని తెలిపారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి గీతాదేవి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు పాటిస్తూ అనవసర వ్యయం తగ్గించుకోవాలని సూచించారు. నాటిన 40 రోజుల తరువాత కాంప్లెక్స్ ఎరువులు వాడరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల రత్నకుమారి మధు, ఉంగుటూరు ఏఎంసీ ఉపాధ్యక్షుడు కూనసాని నాగేశ్వర రావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలలో కఠోర శిక్షణ



పిరమిడ్ విన్యాసం చేస్తున్న విద్యార్థులు

గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వ్యాయామ అధ్యాపకులకు నిరంతరం ఉత్కంఠతో కూడిన శిక్షణను అందించారు. కోలాటం, పిరమిడ్స్, మాల్కం, అడ్వెంచర్ ఫైర్ యాక్టివిటీస్, డ్రిల్‌లలో శిక్షణ ఇస్తున్నారు. వీటిని కళాశాలలో జరిగే అన్ని ఫంక్షన్లలో విధిగా ప్రదర్శన చేయవలసి ఉంది. - దెందులూరు

సంక్షోభంలో సంక్షేమం



శింగవరంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్



నిరుపయోగంగా ఉన్న బాత్‌రూమ్‌లు

దెందులూరు: మండలంలోని సింగవరంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ దినదిన గండంగా మారింది. ఈ హాస్టల్లో 65 మంది బాలికలు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు వసతి పొందుతున్నారు. భవనం శిథిలమై పెచ్చులూడి పడుతున్నాయి. ఆరు బాత్‌రూములకు రెండు బాత్‌రూమ్‌లు పని చేయడం లేదు. తాగు నీరు కూడా స్వచ్ఛంద సంస్థ అందజేస్తుంది. సంబంధిత శాఖ జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు హాస్టల్ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని బాలికలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.